
సాక్షి ఒడిశా

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,91,409లు, బంగారం 350 మిల్లీగ్రాములు, వెండి 52 గ్రాముల 800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రాగుల పంటపై దృష్టి సారించాలి

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే రాగుల పంటపై రైతులు దృష్టి సారించాలని ఓపీడీఎస్‌సీ సంస్థ కన్వీనర్ కవిరాజ్ ప్రధాన్ సూచించారు.

- 8లో



మూడు ఇళ్లలో దొంగతనం

పర్లాకిమిడి దామోదర్ విహార్ 3వ లైన్‌లో మూడు ఇళ్లలో సోమవారం రాత్రి ఒకేసారి దొంగతనం జరిగింది.

- 8లో

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ పోస్టు రద్దు చేయండి



వినతిపత్రం అందజేసేందుకు వెళ్లిన కసమగుడ గ్రామస్తులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి గుజునిగుడ పంచాయతీ కసమగుడ గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్ పోస్టును రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సబ్ కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఆసక్తి, అర్హత కలిగిన మహిళలు ఉన్నప్పటికీ ఇతర ప్రాంతాలకు చెందినవారిని నియమించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన ఇతర గ్రామాలకు చెందినవారు తమ గ్రామస్తులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. మరోసారి అంగన్‌వాడీల భర్తీకి నోటిఫికేషన్ ప్రభుత్వం ఇచ్చిందని, అయితే ఈసారి ఇతర గ్రామస్తులతో భర్తీచేస్తే గ్రామంలోకి అడుగు పెట్టనీయమని హెచ్చరించారు. కార్యక్రమంలో అశ్వినీ గౌఢ, ఘనశ్యామ్ గౌఢ, బుదాయి గౌఢ, తులసీ గౌఢ, చందన గౌఢ, జమున నాగ్, సతియ గౌడ, రమా హరిజన్, సునీత నాగ్, కమల లోచన గౌఢ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థిని

జయపురం: స్థానిక ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం (డైట్)లో రక్తదాన శిబిరం మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 51 యూనిట్ల రక్తం సేకరించినట్లు డైట్ ప్రిన్సిపాల్ రూపచంద్ర ప్రదాన్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం లభించక ఎంతోమంది మరణిస్తున్నారని, అటువంటి వారికి రక్తదాన శిబిరాల్లో సేకరించిన నిల్వలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సుభస్మిత దాస్, ఒడిశా బ్లడ్ సెంటర్ అధికారి డాక్టర్ మధుసూదన బలియ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు



దొంగలించిన బైక్



అరెస్టైన నిందితుడు సామసన్

జయపురం: ఒక బైక్ దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసుస్టేషన్ అధికారి ఈశ్వర చంద్ర తండి మంగళవారం తెలియజేశారు. అరెస్టైనవారిలో ఒకరు మైనర్ కాగా, మరోవ్యక్తి జయపురం సమితి ధన్‌పూర్‌కు చెందిన సామసన్ హరిజన అలియాస్ బుడు అని పేర్కొన్నారు. వారి నుంచి బైక్ స్వాధీనం చేసుకున్నారు. మైనర్ బాలుడిని జువైనల్ జస్టిస్ కోర్టుకు తరలించినట్లు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 2వ తేదీన జయపురం సమితి బొడొకావిడి గ్రామంలో గంగాధర పంగి ఇంట్లో పెళ్లికి బొడొకావిడి గ్రామానికి చెందిన పదన మాఝి తన బైక్‌పై వెళ్లాడు. పెళ్లి అనంతరం తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో జయపురం సదర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గగనాపూర్ పోలీసు పంటి అధికారి రాజకిశోర్ బారిక్ దర్యాప్తు జరిపి ఎట్టకేలకు నిందితులను పట్టుకున్నారు. అనంతరం పొడైకర గ్రామంలో ఉంచిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

దేవాలయం పరిశుభ్రం



దేవాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని పురాతన నీలకంఠేశ్వర దేవాలయ ప్రాంగణాన్ని ఐకాన్స్ ఇన్‌మోషన్ ప్రతినిధులు మంగళవారం పరిశుభ్రం చేశారు. శివరాత్రి పురస్కరించుకొని కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.

శివపూజకు వేళాయె..!



ఆది దేవుడు.. లయకారుడు.. బోళా శంకరుని పూజకు వేళయ్యింది. ముక్కంటిగా నిరంతరం భక్తకోటితో పూజలందుకునే అభిషేక ప్రియుడి నామస్మరణతో శివరాత్రి జరుపుకునేందుకు భక్తులంతా సిద్ధమయ్యారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రసిద్ధ ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్ దీపాలతో సుందరంగా దేవాలయాలను అలంకరించారు.

\- సాక్షి నెట్‌వర్క్



లింగరాజు దేవస్థానం

మహేంద్రం.. జనసంద్రం


పర్లాకిమిడి: పవిత్ర మహా శివరాత్రి పురస్కరించుకుని మహేంద్రగిరికి మంగళవారం సాయంత్రం నుంచి భక్తులు పోటెత్తారు. ఈ ఏడాది జిల్లా యంత్రాంగం తాగు నీరు, విద్యుత్, పార్కింగ్ వంటి సౌకర్యాలు కల్పించింది. రాయఘడ ఆర్‌ఎస్‌ఎస్ శాఖ తరుపున యాత్రికులు బస చేయడానికి టెంట్లు, భోజన సౌకర్యం కల్పించారు. అలాగే పోలీసులు మహేంద్రంలో కుంతీ, యుధిష్ఠర, భీమ, పరశురాం మందిరం వద్ద భద్రత పెంచారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా మందస, సాబకోట, కించిలింగి రోడ్డు మీదుగా కూడా భక్తులు మహేంద్రం చేరుకుంటున్నారు. రాత్రికి అక్కడ బసచేసి వేకువజామున సూర్యోదయం చూసి అన్ని మందిరాలను దర్శించుకుంటారు. గజపతి ఎస్పీ జితేంద్ర కుమార్ పండా యాత్రికుల భద్రత కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు.



పర్లాకిమిడి: కాలినడకన మహేంద్రగిరికి చేరుకుంటున్న యాత్రికులు



పర్లాకిమిడి: బుర్‌ఖాత్ పాస్ వద్ద మహా శివరాత్రికి ఏర్పాటు చేసిన ద్వారం



పర్లాకిమిడి: భీముని మందిరం



పర్లాకిమిడి: మహేంద్రగిరి కొండ దిగువున పార్కింగ్ స్థలం



పర్లాకిమిడి: అలంకరించిన కుంతీ మందిరం

మహాదీపం.. దర్శన భాగ్యం

భువనేశ్వర్: పవిత్ర మహా శివరాత్రి పురస్కరించుకుని స్థానిక లింగరాజు ఆలయంలో నిర్ణీత సమయానికి మహా దీప దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ అధ్యక్షతన ఏకామ్ర క్షేత్రంలో మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. నిర్ణీత సమయానికి మహా దీప దర్శనం లభించేలా సకాలంలో సేవాదులు నిర్వహించడంలో పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని బ్రాహ్మణ నియోగుల ప్రతినిధి తెలిపారు.

40 ప్లాటూన్ల పోలీసుల భద్రత

మహా శివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని లింగరాజు ఆలయం పరిసరాల్లో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా రద్దీ నియంత్రణ, వాహనాల రాకపోకల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం 40 ప్లాటూన్ల పోలీసులను మోహరిస్తున్నట్లు భువనేశ్వర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) పినాక్ మిశ్రా మంగళవారం ప్రకటించారు. పవిత్ర మహా శివరాత్రి రోజు లక్షలాది మంది భక్తులతో లింగరాజ్ ఆలయం కిటకిటలాడుతుంది. అర్ధరాత్రి మహా దీప దర్శనం వరకు రద్దీ నిరవధికంగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నిర్వహణ, రద్దీ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీసీపీ వివరించారు. ఈ కార్యాచరణలో భాగంగా అగ్నిమాపక దళాలు, అత్యవసర సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. వివిధ హోదాలకు చెందిన 100 మందికి పైగా పోలీసు అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో లింగరాజ ఆలయం వద్ద దాదాపు 40 ప్లాటూన్ల పోలీసు బలగాలను రంగంలోకి దింపుతున్నారు. బుధవారం వేకువజాము నుంచి పోలీసు భద్రత అమలులో ఉంటుంది.

గుప్తేశ్వర్‌లో ఏర్పాట్లు పరిశీలన

జయపురం: దక్షిణ ఒడిశాలోని సుప్రసిద్ధ శివ క్షేత్రం గుప్తేశ్వర్ పుణ్యక్షేత్రంలో శివరాత్రి ఏర్పాట్లను కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్ సోమవారం పరిశీలించారు. మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మూడు రోజుల పాటు అనేక మంది భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకోనున్నారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణ, రక్షిత తాగునీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యం తదితర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అలాగే భక్తులు స్నానాలాచరించే శబరీ నది ఘాట్‌ను ఆయన సందర్శించారు. నదిలో ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక సిబ్బందిని ఘాట్ వద్ద నియమించాలని సూచించారు. మొత్తం శాంతి భద్రతలు కాపాడేందుకు 15 ప్లాటూన్ల పోలీసు బలగాలను నియమించినట్లు ఎస్పీ రోహిత్ వర్మ తెలియజేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఎ.శౌశ్య రెడ్డి, జయపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారి అంకిత వర్మ, బొయిపరిగుడ తహసీల్దార్ స్నిగ్ధ రాణి చౌదరి, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగ ఎస్‌డీవో అంకిత్ ప్రతీక తోయ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

టిక్కెట్టు విధానం రద్దు చేయాలి



వినతిపత్రం అందజేసిన హిందూ సమాజ్ కార్యకర్తలు

జయపురం: ప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్‌లో దర్శనానికి టిక్కెట్టు విధానం రద్దు చేయాలని సబ్ డివిజన్ బొయిపరిగుడ హిందూ సమాజ్ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ శౌశ్యరెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భక్తుల నుంచి నిర్బంధంగా టిక్కెట్టు కోసం డబ్బులు వసూలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలోని ప్రసిద్ధ లింగరాజ్ మందిరం, పూరీ మందిరాల్లో సైతం దైవ దర్శనానికి టిక్కెట్టు వ్యవస్థ లేదని గుర్తు చేశారు. టిక్కెట్టు వ్యవస్థను రద్దు చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్వామీ బిశ్వా మిత్ర నందగిరి, రమేష్ నరోజీ, ఘన హంతాల్, రవీంద్ర నాయిక్, సంతోష్ మిశ్ర, రబీ ఖిలో, లంబోధర స్వైన్, పితబాస్ పంగి, గౌరహరి మాలి, సురేష్ స్వైన్ పాల్గొన్నారు.

గంగమ్మ ఒడిలో...

రాయగడ: సదరు సమితి తెరువలి సమీపంలోని పాయికొపాడ వద్దనున్న నాగావళి నది ప్రవాహానికి ఒక శివలింగం కొట్టుకొచ్చింది. మంగళవారం ఉదయం కొంతమంది గ్రామస్తులు నదిలో స్నానమాచరిస్తుండగా శివలింగాన్ని చూశారు. అనంతరం గ్రామస్తులంతా కలిసి పవిత్రమైన శివలింగాన్ని పాయికొపాడ మందిరంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రికి ముందే పరమేశ్వరుడి దర్శనం కావడం అదృష్టమని భావిస్తున్నారు.




నాగావళి నదిలో శివలింగం

రాష్ట్రంలో స్వల్ప భూప్రకంపనలు



భువనేశ్వర్: రాష్ట్రంలో స్వల్ప భూకంపం మంగళవారం చోటుచేసుకుంది. రాజధానితో పాటు వివిధ జిల్లాల్లో భూ ప్రకంపనలు వచ్చాయి. బంగాళాఖాతంలో సంభవించిన ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.1గా నమోదైంది. బంగాళాఖాతంలో 91 కిలోమీటర్ల లోతున మంగళవారం ఉదయం 6.10.25 గంటలకు భూకంపం సంభవించినట్లు సమాచారం. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్సీఎస్) ప్రకారం, ఈ భూకంపం ఉత్తర అక్షాంశం 19.52 మరియు తూర్పు రేఖాంశం 88.55 వద్ద నమోదైంది. బంగాళాఖాతం కేంద్రంగా భూ ప్రకంపన చోటు చేసుకుంది. రాజధాని భువనేశ్వర్ సహా ఇతర జిల్లాల్లో కూడా భూకంప ప్రకంపనలు సంభవించాయి. రాష్ట్రానికి 175 కిలోమీటర్ల దూరంలో బంగాళాఖాతంలో భూ ప్రకంపన కేంద్రీకృతం అయింది. రాష్ట్రంలోని తీరప్రాంత జిల్లాల్లో దీని ప్రభావం ఎక్కువగా కనబడింది. దాదాపు 2 నుంచి 3 సెకన్ల పాటు ప్రకంపనలు సంభవించాయి. భువనేశ్వర్ నుంచి 297 కిలోమీటర్లు, పూరీ నుంచి 286 కిలోమీటర్లు, బరంపురం నుంచి 394 కిలోమీటర్లు, కోల్‌కతా నుంచి 340 కిలో మీటర్ల దూరంలో బంగాళాఖాతంలో భూకంపం కేంద్రీకృతమైంది. దీని ప్రభావంతో భువనేశ్వర్, పూరీ, బాలాసోర్, బరిపద, బరంపురం, పారాదీప్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్ పాటు మరికొన్ని చోట్ల ప్రకంపనలు సంభవించాయని సమాచారం. పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో 2 నుంచి 3 సెకన్ల పాటు భూ ప్రకంపనం సంభవించినట్లు సమాచారం. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎటువంటి ఆస్తి నష్టం, ప్రాణ హాని సంభవించలేదని రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.



ఎన్సీఎస్ జారీ చేసిన భూకంపం కేంద్రీకృత ఫొటోలు

కలుషిత నీటి వలనే మరణాలు

భువనేశ్వర్: పూరీ జిల్లా కొణాస్ ప్రాంతంలో కలుషిత నీటి వినియోగంతో పలువురు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ప్రాంతంలో దయా నదినీరు కలుషితం కావడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు ప్రాథమిక నివేదికలో తేలింది. ఈ విచారకర ఘటనపై ఒడిశా మానవ హక్కుల కమిషన్ చొరవ కల్పించుకుంది. ఈ నేపథ్యంలో ప్రమాదంపై బాధ్యులైన వారిని గుర్తించి విచారణకు కమిషన్ ముందు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది. తదుపరి విచారణ మార్చి 3వ తేదీకి వాయిదా వేసింది. ఆరోజు రాష్ట్ర ఆరోగ్య, జల వనరులు, పంచాయతీ రాజ్, తాగునీరు శాఖ కార్యదర్శులు, పూరీ జిల్లా మేజిస్ట్రేటు వ్యక్తిగతంగా హాజరు కావాలని తాఖీదులు జారీ చేసింది.

జెడ్పీ సమావేశం రసాభాస

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జెడ్పీ చైర్మన్ మెతిరాం నాయక్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. సమావేశం ప్రారంభమవ్వగానే సభ్యులంతా అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. మొత్తం జిల్లాలో 26 స్థానాలకు గాను 25 మంది బీజేడీ, ఒక స్థానంలో కాంగ్రెస్ సభ్యులు ఉన్నారు. బీజేపీకి సంబంధించి ఒక్క సభ్యుడు కూడా లేడు. దీంతో అధికారులు జెడ్పీ సభ్యులకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదు. దీంతో మంత్రి నిత్యానంద గొండో మాట్లాడుతుండగా, కాంగ్రెస్ సభ్యురాలు డాక్టర్ లిపికా మజ్జి ఒక్కసారిగా లేచి తమకు ఎటువంటి అధికారిక సమాచారం ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఆమెతో పాటు బీజేడీ సభ్యులు కూడా అధికారులపై మండిపడ్డారు. అనంతరం సమావేశం నుంచి వాకౌట్ చేశారు. వెంటనే కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో, మంత్రి గౌరీ శంకర్ మజ్జిలు వచ్చి సభ్యులను బుజ్జగించారు.



నిరసన తెలుపుతున్న జెడ్పీ సభ్యులు

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని ప్రసవం

మల్కన్‌గిరి: జిల్లాలో చిత్రకొండ సమితి కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఒక పదో తరగతి విద్యార్థిని ప్రసవించింది. వివరాల్లోకి వెళ్తే.. చిత్రకొండ సమితిలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని సోమవారం పదో తరగతి పరీక్ష రాసి వచ్చింది. అనంతరం సాయంత్రం విద్యార్థిని కనిపించకపోవడంతో హాస్టల్ నిర్వాహకులు తల్లిదండ్రులకు ఫోన్‌చేసి విషయం తెలియజేశారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళనగా హాస్టల్‌కు వచ్చారు. అనంతరం హాస్టల్‌లో మొత్తం వెతకగా ఒక రూమ్ బాలిక ప్రసవించి అక్కడే ఉంది. దీంతో అందరూ షాక్‌కు గురయ్యారు. విషయం తెలియడంతో చిత్రకొండ ఐఐసీ ముకుందో మేల్కా ఆశ్రమ పాఠశాలకు చేరుకొని బాలికను, పుట్టిన శిశువు చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాలిక 8 నెలల గర్భిణీ కాగా ఇప్పటివరకు ఎవరూ గుర్తించకపోవడం గమనార్హం. ఘటనపై చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో పాఠశాల వద్దకు చేరుకొని నిర్వాహకులపై మండిపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పాఠశాల వద్దకు చేరుకున్న చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో తదితరులు



ఆరోగ్య కేంద్రానికి బాలిక, శిశువును తరలిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

కె.జె.పురం ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

సారవకోట: మండలంలోని కె.జె.పురం ఫీల్డ్ అసిస్టెంట్ కుమారస్వామిని సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ మంగళవారం తెలిపారు. గత ఏడాది జరిగిన సామాజిక తనిఖీల్లో సుమారు రూ.5 లక్షలు రికవరీ గుర్తించడంతో పాటు ప్రతి వారం జరిగే సాధారణ సమావేశాలకు హాజరు కాకపోవడం, ఇటీవల కమిషన్ పెట్టిన సమావేశానికి సైతం హాజరు కాకపోవడంతో తాత్కాలికంగా విధుల నుంచి తప్పిస్తున్నట్లు ఆయన చెప్పారు.

డీఐజీని కలిసిన ఎస్పీ



డీఐజీ గోపినాథ్‌జెట్టికి మొక్క అందజేస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు మంగళవారం విచ్చేసిన విశాఖపట్నం రేంజి డీఐజీ గోపినాథ్ జెట్టిని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సాదరంగా ఆహ్వానించి పూలమొక్కను అందజేశారు.

శ్రీముఖలింగంలో చోరీ



తెరిచి ఉన్న బీరువా

జలుమూరు: శ్రీముఖలింగం కాళింగ వీధిలో కాంచనమాల పట్నాక్ ఇంట్లో చోరీ జరిగింది. దుండగులు చొరబడి సుమారు రూ.1.50 లక్షలు నగదు, ఎనిమిది తులాల బంగారం, ఎనిమిది కేజీల వెండి చోరీకి గురైంది. కాంచనమాల వారం కిందట శ్రీకాకుళంలోని తన కుమార్తె ఇంటికి వెళ్లి మంగళవారం సాయంత్రం శ్రీముఖలింగం చేరుకుంది. ఇంటికి వచ్చి చూసేసరికి ప్రధాన తలుపు బద్దలు కొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా లాకర్ బద్దలు కొట్టి ఉంది. అందులో నగదు, వెండి సామగ్రి, బంగారం కనిపించకపోవడంతో జలుమూరు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపింది.

వలస కూలీ అదృశ్యం



తంగి సుబ్బారావు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం భగీరథపురం గ్రామానికి చెందిన తంగి సుబ్బారావు కొన్నాళ్లుగా రాజమండ్రిలో తాపీపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పని పూర్తయ్యాక రాత్రి 8 గంటల సమయంలో అందరూ మెస్‌కు చేరుకుంటారు. ఆదివారం సాయంత్రం కిరాణా షాప్‌కు వెళ్లి తిరిగి రాలేదు. వెతికినా ఆచూకీ కనిపించలేదు. అక్కడి పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశారు. సుబ్బారావు ఆచూకీ కోసం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఎంఈఓ



కూటమి నాయకులతో కలిసి సమావేశంలో కూర్చున్న మెళియాపుట్టి ఎంఈఓ సవర దేవేంద్రరావు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పాకలపాటి రఘువర్మను గెలిపించాలని కోరుతూ పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం పాతపట్నంలోని తన కార్యాలయంలో ఐదు మండలాల కూటమి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ ఉద్యోగులు ఇటువంటి సమావేశాలకు హాజరుకాకూడదు. మెళియాపుట్టిలో మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న సవర దేవేంద్రరావు మాత్రం ఈ కార్యక్రమానికి హాజరై కోడ్ ఉల్లంఘించారు. ఈ ఘటనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరుతున్నారు.

అవినీతి అధికారులపై చర్యలకు ఆదేశాలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని పురుషోత్తపురం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులో 2014లో ఏడుగురు రెవెన్యూ (కమర్షియల్ టాక్స్) విభాగం అధికారులు అవినీతికి పాల్పడుతుండగా ఆకస్మిక తనిఖీలో భాగంగా అప్పటి విజయనగరం రేంజ్ ఏసీబీ డీఎస్పీ పట్టుకున్నారు. దానికి సంబంధించి అప్పటి ఏసీబీ డీజీ కమిషనరేట్ ఆఫ్ ఎంక్వైరీకి నివేదికను సమర్పించారు. అప్పట్లో పట్టుబడిన వారిలో ముగ్గురు ఉద్యోగ విరమణ పొందడం, మరో ఇద్దరు మరణించడంతో వారిని కేసు నుంచి డ్రాప్ చేసింది. మిగతా ఇద్దరిపై తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనరేట్ ఆఫ్ ఎంక్వైరీ (సీవోఐ) ప్రస్తుత అధికారైన రమేష్‌కుమార్ సుమన్ (ఐఎఫ్ అండ్ మెంబర్ -సీవోఐ)కు కేసు అప్పగించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి ప్రకటన విడుదలైంది. చనిపోయిన వారిలో పి.ఆనందరావు (డీసీటీవో), వి.అప్పలనాయుడు (డీసీటీవో)లు ఉండగా, ఉద్యోగ విరమణ పొందినవారి లో డి.బెహరా (ఏసీటీవో), ఎ.శ్రీరాములు (ఏసీటీ వో), డి.వెంకటరావు (జూనియర్ అసిస్టెంట్) ఉన్నారు. ప్రస్తుతం కె.శ్రీనివాసరావు (జూనియర్ అసిస్టెంట్), వై.అప్పలరాజు (జూనియర్ అసిస్టెంట్) విధుల్లో ఉండటంతో వారిపై తదుపరి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రాగుల పంటపై దృష్టి సారించాలి



హాజరైన ఆదివాసీ రైతులు



ప్రసంగిస్తున్న కవిరాజ్ ప్రధాన్

రాయగడ: తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే రాగుల పంటపై రైతులు దృష్టి సారించాలని టీడీఎస్‌సీ సంస్థ కన్వీనర్ కవిరాజ్ ప్రధాన్ సూచించారు. ఈ మేరకు జిల్లాలోని బైరాగి హలువ పంచాయతీ గుసాయి కంటువలో రాగుల పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మిల్లెట్ మిషన్ పథకం ద్వారా రాగుల పంటలకు ప్రోత్సాహమిస్తోందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలను అందించడంతో పాటు మండీల ద్వారా విక్రయించే సౌకర్యాన్ని కల్పించిందన్నారు. ప్రతీ క్వింటాల్‌కు సుమారు రూ.4,500ల ధరను ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. అందువలన ప్రతి ఒక్కరూ రాగుల సాగుపై ఆసక్తి చూపించాలని సూచించారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేస్తున్న దృశ్యం

రాయగడ: మున్సిపాలిటీలోని అశోక్ కల్యాణ మండపంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. రాష్ట్ర దివ్యాంగుల సామాజిక సురక్ష విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆరోగ్య పరీక్షల్లో 498 మంది దివ్యాంగులను గుర్తించి, వారికి వివిధ రకాల ఉపకరణాలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి కులదీప్ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యువకుడి మిస్సింగ్‌పై ఫిర్యాదు



కొరాపుట్ కలెక్టరేట్ వద్ద గిరిజనులు

కొరాపుట్: చెన్నైలో తప్పిపోయిన యువకుడి కోసం కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి కుంబార్ గందన గ్రామ పంచాయతీ కియాకంట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్‌ను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. తమ గ్రామానికి చెందిన మోహన కిరసాని అనే యువకుడు గ్రామస్తులతో కలసి చెన్నై కూలి పనులకు వెళ్లాడన్నారు. అక్కడ నుంచి అనారోగ్యంతో ఈనెల 23వ తేదీన స్వగ్రామం బయల్దేరినట్లు తెలిపారు.

తాము ఈ విషయంపై నందపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై కొరాపుట్ జిల్లా ఎస్పీకి మరో ఫిర్యాదు చేశారు.

బొడ్డేపల్లిలో ఇసుక తవ్వకాలపై ఆరా



ర్యాంపును పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎస్‌ఐ

పొందూరు: మండలంలోని బొడ్డేపల్లిలో జరుగుతున్న ఇసుక అక్రమ ర్యాంపును తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు, ఎస్‌ఐ వి.సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ రెండు రోజుల క్రితం బొడ్డేపల్లి, నెల్లిమెట్ట ర్యాంపులను పరిశీలించడానికి వెళ్లిన సందర్భంలో టీడీపీ సామాజికవర్గ నాయకులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు పరిశీలన చేశారు. ర్యాంపులో ఆరు ట్రాక్టర్లు, ఐదుగురు కూలీలు ఉన్నారని, ఇకపై రోజూ పరిశీలనలు చేస్తామని తెలిపారు. ఇక్కడ లోతుగా తవ్వకాలు జరిగినట్లు గుర్తించామన్నారు. పూసపాటిరేగ, లావేరు నుంచి వచ్చి ట్రాక్టర్లతో ఇసుకను తీసుకెళ్తున్నట్లు గుర్తించామని, ర్యాంపులో యంత్రాలు లేవని స్పష్టం చేశారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

టెక్కలి రూరల్: స్థానిక తెంబూరు రోడ్డులోని రైల్వే గేటు సమీపంలో మంగళవారం రైలు ఢీకొని రాధావల్లభపురం గ్రామానికి చెందిన బగాది అప్పలనాయుడు(65) అనే వృద్ధుడు మృతిచెందాడు.వ్యక్తిగత పనుల నిమిత్తం టెక్కలి వచ్చిన అప్పలనాయుడు అయ్యప్పనగర్ వైపు వెళ్లేందుకు రైల్వే ట్రాక్ దాటుతుండగా నౌపడ నుంచి గుణుపూర్ వైపు వెళ్తున్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన అనంతరం రైలును సుమారు 20 నిమిషాల పాటు నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న పలాస రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పలనాయుడుకు నలుగురు కుమార్తెలు. అందరికీ పెళ్లిళ్లు చేసి తన భార్య మాణిక్యంతో కలిసి గ్రామంలో వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇంతలో దుర్ఘటన జరగడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



అభిరామ్(ఫైల్)

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన బెండి అభిరామ్(18) అనే యువకుడు మంగళవారం శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడిది టెక్కలి మండలం జయకృష్ణపురం గ్రామం. గోపినాథపురం సమీపంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఫేర్‌వెల్ డే సందర్భంగా స్నేహితుడిని తీసుకొచ్చేందుకు నందిగాం మండలం తామరాపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన అభిరామ్‌ని టెక్కలి జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందారు. టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని అతని స్నేహితులు జగతిమెట్ట జంక్షన్ నుంచి మృతుడి స్వగ్రామమైన జయకృష్ణాపురం వరకు ర్యాలీగా తీసుకువెళ్లారు. కాగా, ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు బెండి వనజాక్షి, గణేష్ శోకసంద్రంలో మునిగిపోయారు.


కాంట్రాక్ట్ ఉద్యోగి ఆత్మహత్య



వలిశెట్టి తులసి(ఫైల్)

సోంపేట: మండలంలోని బారువ మేజర్ పంచాయతీ బారువ కొత్తూరు గ్రామానికి చెందిన వలిశెట్టి తులసి (24) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తులసి మండలంలోని బట్టిగళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎం.ఎల్.హెచ్.ఓగా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తోంది. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అదే ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.ప్రదీప్ తమ కుమార్తెను వేధించడం వల్లే మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని తండ్రి హేమారావు బారువ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తులసి తల్లి బోగమ్మ, సోదరి కుంభమేళాకు వెళ్లారు. తండ్రి ఫిర్యాదు మేరకు బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్గిపుల్లలతో అద్భుతం



కేదారనాథ్ ఆలయ నమూనాతో శాశ్వత్ రంజన్

భువనేశ్వర్: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని పూరీ కుంభరపడా ప్రాంతంలో ఉంటున్న యువ కళాకారుడు శాశ్వత్ రంజన్ సాహు (22) 602 అగ్గి పుల్లలను ఉపయోగించి కేదార్‌నాథ్ ఆలయం అద్భుతమైన సూక్ష్మ నమూనాను రూపొందించాడు. దీని పొడవు 12 సెంటీమీటర్లు, వెడల్పు 9 సెంటీమీటర్లు. దీనిని పూర్తి చేయడానికి 4 రోజులు పట్టినట్లు శాశ్వత రంజన్ వివరించాడు.

జగన్నాథ సాగర్ సందర్శన



పనులపై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

జయపురం: జగన్నాథ సాగర్ పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టకపోతే ఈనెల 28వ తేదీన ఆందోళన జరపనున్నట్లు స్థానికులు తెలియజేశారు. దీంతో రాష్ట్ర పట్టణ అభివృద్ధి విభాగ ఉన్నతాధికారి హడిబందు బెహర జగన్నాథ్ సాగర్‌ను మంగళవారం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు నిలిచిపోయిన పనులను సమీక్షించారు. సాగర్ పనుల పునరుద్ధరణకు ప్రభుత్వం చెల్లించాల్సిన నిధులను విడుదల చేస్తుందని వెల్లడించారు. అనంతరం సబ్ కలెక్టర్ ఎ.శౌర్య రెడ్డితో చర్చించారు. ఆయనతో పాటు జూనియర్ ఇంజినీర్లు అజయ్ కుమార జెన, ప్రతాప్ చంద్ర ఆచార్య ఉన్నారు.

ఈనెల 28న జేపీ నడ్డా రాష్ట్ర పర్యటన

భువనేశ్వర్: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా ఒక్కరోజు రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఈనెల 28న పూరీలో నిర్వహించనున్న జాతీయ ఆరోగ్య సదస్సుకు ఆయన హాజరవుతారు. ఆయనతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హాజరవ్వనున్నారు. వివిధ రాష్ట్రాల జాతీయ ఆరోగ్య మిషన్ల మేనేజింగ్ డైరెక్టర్లు ఈ సదస్సులో పాలుపంచుకుంటారు.

పరామర్శ



రాజ్యలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్: కొరాపుట్ మాజీ ఎంపీ జయరాం పంగి కుమార్తె డాక్టర్ రాజ్యలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో వారి కుటుంబాన్ని ప్రస్తుత కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉల్క మంగళవారం పరామర్శించారు. ఆయనతో పాటు పొట్టంగి ఎమ్మెల్యే రాం చంద్ర ఖడం తదితరులు ఉన్నారు.

మూడు ఇళ్లలో దొంగతనం



చోరీకి గురైన ఇల్లు



చెల్లాచెదురైన బీరువాలో సామగ్రి

పర్లాకిమిడి: స్థానిక దామోదర్ విహార్ 3వ లైన్‌లో మూడు ఇళ్లలో సోమవారం రాత్రి ఒకేసారి దొంగతనం జరిగింది. ఈ విషయం మంగళవారం ఉదయం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. దామోదర్ విహార్ 3వ లైన్‌లో అద్దెకు నివాసముంటున్న సర్పంచ్ సంఘమిత్ర దొళాయి ఇంట్లో 12 గ్రాముల బంగారం, రూ.35 వేల నగదు, విలువైన పత్రాలు దొంగలించారు. అమె రాయఘడ బ్లాక్‌లోని పరిషల్ గ్రామానికి సమావేశం నిమిత్తం సోమవారం ఉదయం వెళ్లారు. అదే లైన్‌లో ఉంటున్న సుధీర్ కుమార్ శతపతి బరంపురం క్యాంపుకు వెళ్లడంతో వారి ఇంట్లో రూ.లక్ష నగదు, రెండు తులాల బంగారం దుండగులు కాజేశారు. అలాగే మరో ఇంట్లో సైతం చోరీ జరిగింది. దీంతో బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీల వెనుక పెద్ద గ్యాంగ్ ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆశ్రమ పాఠశాల నుంచి విద్యార్థి పరారీ



బాలుడిని హెచ్‌ఎంకు అప్పగిస్తున్న పోలీసులు

రాయగడ: గోడ దూకి రెండో తరగతి చదువుతున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థి పారిపోయిన ఘటన జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ పరిధి తుటిబార్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఆశ్రమ పాఠశాలలో 350 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి ఆలనాపాలన కోసం ప్రభుత్వం ముగ్గురుని నియమించగా, చదువు చెప్పేందుకు మరో ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న రెండో తరగతి విద్యార్థి గోడ దూకి పారిపోయాడు. ఆ బాలుడు టికిరి పరిధి సారిషాపాదొరొ గ్రామం నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా చూసిన సామాజిక కార్యకర్త సుకాంత్ బిసాయి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. అనంతరం వెంటనే అతడిని టికిరి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించాడు. టికిరి పోలీస్‌స్టేషన్ ఐఐసీ విశ్వబందినీ బాగ్ వెంటనే ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం శాంతిలత బెహరకు సమాచారం అందించింది. అనంతరం హెచ్‌ఎం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విద్యార్థిని తిరిగి ఆశ్రమ పాఠశాలకు తీసుకెళ్లారు. అయితే ఆశ్రమ పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యం గురించి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హరభంగి జలాశయం సందర్శన



జలాశయం పరిశీలిస్తున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ అడవ వద్ద హరభంగి జలాశయం ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ మంగళవారం సందర్శించారు. మోహనలో ఉన్న హరభంగి జలాశయం ప్రాజెక్టు ద్వారా గంజాం, గజపతి జిల్లాలకు సాగు, తాగునీరు అందుతోంది. దీనిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు.

గంజాయి రవాణా గుట్టురట్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వి.వెంకట అప్పారావు

- పలాస, వజ్రపుకొత్తూరు, ఇచ్ఛాపురం, సోంపేటలలో పట్టుబడిన నిందితులు
- వివరాలు వెల్లడించిన కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని అక్రమ రవాణ చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఇచ్ఛాపురం సీఐ కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ విలేకరులకు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని జల్నా జిల్లాకి చెందిన రవిరా మదోత్రె, పర్బాని జిల్లా జింతూరు గ్రామానికి చెందిన విశ్వనాథ్ తుకారామ్‌లు బరంపురం కొత్తబస్టాండ్ వద్ద ఆలోక్‌పరిచ్చా నుంచి 10.020 కేజీల గంజాయిని తీసుకొని మంగళవారం ఇచ్ఛాపురం చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా రత్తకన్న రోడ్డు ఎల్‌సీ గేట్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల వద్ద నుంచి గంజాయి, రెండు సెల్‌ఫోన్ల స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. సీఐ మీసాల చిన్నంనాయుడు, రూరల్ ఎస్సై శ్రీనివాసరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.


సోంపేట: ఒడిశా నుంచి ముంబైకు గంజాయి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తితో పాటు మరో ముగ్గురిని బారువ పోలీసులు అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. మంగళవారం సోంపేట సీఐ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రధాన రాజేష్ సంతోష్‌బాయ్ కుదల గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం వద్ద నుంచి 6.210 కిలోలు గంజాయిని కొనుగోలు చేశాడు. ముంబైలో ఉంటున్న పింటుబాయ్‌కు ఇచ్చేందుకు సోంపేటకు బస్సులో వచ్చాడు. అక్కడి నుంచి విశాఖ వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉండగా సోంపేట ఎస్‌ఐ లవరాజుకు వచ్చిన సమాచారం మేరకు రాజేష్‌ను పట్టుకుని అరెస్టు చేశారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నువులూరుకు చెందిన ఎం.దినకర్, దుగ్గిరాల మండల అవిని గ్రామానికి చెందిన సవలం అన్వేష్, సోంపేట మండలం బారువ కొత్తూరు గ్రామానికి చెందిన కసరాపు దిలీప్ స్నేహితులు. గంజాయికి బానిసయ్యారు. ముగ్గురూ కలిసి ఒడిశా రాష్ట్రం సుమండి గ్రామానికి వెళ్లి కేజీ 900 గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. బైక్‌పై తిరిగి వస్తుండగా మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడు, సిబ్బంది పట్టుకున్నారు. ముగ్గురినీ అరెస్టు చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐ బి.మంగరాజు, సోంపేట, బారువ ఎస్‌ఐలు లవరాజు, హరిబాబునాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: రెండు వేర్వేరు ఘటనల్లో 18 కిలోల 280 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. మంగళవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో రూరల్ సీఐ డి.తిరుపతి, ఎస్‌ఐ బి.నిహార్‌లతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం బెండిగేటు జంక్షన్‌కు ఒడిశా రాష్ట్రం గంజాంకు చెందిన మనయ్ సబర్, ప్రశాంత్ మల్లిక్, వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవుకు చెందిన బైనపల్లి షణ్ముఖ గంజాయితో వచ్చారు. అనుమానాస్పదంగా తిరగడంతో తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 8.280 కిలోల గంజాయి, మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. అదే రోజు పూండి రైల్వే స్టేషన్‌లో 10 కిలోల గంజాయిని రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రం గంజాంకు చెందిన ప్రశాంత్ కుమార్, భారతీ షాహు, ముంబైకు చెందిన నవాబ్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 10 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం నరసన్నపేట కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు.

నిరుద్యోగ యువతే టార్గెట్..

ఒడిశా ప్రాంతంలో ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి స్థానిక నిరుద్యోగ యువత ద్వారా మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారని డీఎస్పీ తెలిపారు.గంజాయి మాఫియా నిరుద్యోగ యువతను టార్గెట్‌గా చేసుకుని అమాయకులను ఉచ్చులో దింపి ఆయా ప్రాంతాలకు రవాణా చేసి కిలో రూ.20వేలకు పైగా విక్రయాలు చేస్తున్నారని చెప్పారు. తాత్కాలిక ఆనందాలు, మత్తు పదార్థాలకు యువత బలికావద్దని హితవుపలికారు. ఇలాంటి పనులు చేసే ముందుగా తమ కుటుంబాలను యువత గుర్తు చేసుకోవాలన్నారు. గంజాయితో పట్టుబడితే తీవ్రమైన కేసులతో పాటు ఆస్తులను సైతం సీజ్ చేస్తామని హెచ్చరించారు. గంజాయి రవాణా సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం అందించి మెరుగైన సమాజం కోసం కృషి చేయాలని ప్రజలను కోరారు.

40 కేజీల గంజాయితో ఇద్దరు అరెస్టు



కాశీబుగ్గ: గంజాయిని స్వాధీనం చేస్తున్న పోలీసులు

కాశీబుగ్గ: ఒడిశా నుంచి చెన్నై, బెంగళూరు పట్టణాలకు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నట్లు కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు, సీఐ సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఒడిషా రాష్ట్రం రాయగడ జిల్లా మోహన గ్రామానికి చెందిన బబుల్లు ఉదయగిరిలో గంజాయి సాగు చేస్తున్నారు. ఆయనకు వచ్చిన 40 కేజీల గంజాయి ఆర్డర్‌ను తరలించడానికి మధ్యవర్తులు నరేంద్ర లిమా, లితు రైట్‌లు రూ.20వేలకు ఒప్పుకున్నారు. వీరు పలాస రైల్వేస్టేషన్‌కు రెండు ద్విచక్ర వాహనాలతో రాగా పోలీసులకు పట్టుబడ్డారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

క్లుప్తంగా

బస్సు ఢీకొని వ్యక్తి మృతి


మడక కృష్ణ (ఫైల్)

రామభద్రపురం: మండలంలోని బూశాయవలస గ్రామానికి చెందిన వ్యక్తి బస్సు ఢీకొనడంతో గాయపడి బాడంగి సీహెచ్‌సీలో సోమవారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మడక కృష్ణ(62)తన ఇంటికి వెళ్లిపోవడానికి సోమవారం సాయంత్రం జాతీయ రహదారి దాటుతుండగా విజయనగరం నుంచి మితిమీరిన వేగంతో వస్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీ కొట్టింది. దీంతో కృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ప్రథమ చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుడు మడక శ్రీరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వి.ప్రసాదరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

48 గంటల పాటు మద్యం అమ్మకాలు బంద్

పార్వతీపురంటౌన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లాలోని మద్యం దుకాణాలు 48 గంటల పాటు మూసివేసినట్లు ఎక్సైజ్ ఈఎస్ బి.శ్రీనాథుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లాలోని మద్యం దుకాణాలకు సీల్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 53 మద్యం దుకాణాలు, 8 బార్లకు సీల్ వేశామన్నారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఈ నెల 27 సాయంత్రం నాలుగు గంటల వరకు మూసివేస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల 3వ తేదీన ఓట్ల లెక్కింపు రోజు కూడా వాటిని యూసివేయాలని ఆదేశించారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో ఎక్సైజ్ సీఐ వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ వెంకట్రావు మాట్లాడుతూ శివరాత్రి జాతర సందర్భంగా నెల్లిమర్ల–బొప్పడాం రహదారిలో పూర్తిస్థాయిలో నిఘా పెట్టామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే మద్యం షాపులను మూసివేశామని, బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా గ్రామాల్లో మద్యం అమ్మకాలు సాగిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమనసు చాటుకున్న చిన్నారి


శ్యామ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది

మెరకముడిదాం: ఆ బాలుడు వయసులో చిన్నవాడే.. కానీ మనసు పెద్దదని చాటుకున్నాడు. మెరకముడిదాం జెడ్పీ ఉన్నతపాఠశాలలో ఆరురోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ శిక్షణ తరగతులకు హాజరైన భైరిపురం అంగన్‌వాడీ కార్యకర్త సుజాత తన చెవికి ఉన్న బంగారు చెవిదిద్దను పారేసుకున్నారు. అది ఎంత వెతికినా దొరకకపోవడంతో ఆమె తోటి అంగన్‌వాడీ కర్యకర్తలతో కలిసి పాఠశాల పరిసరాలన్నీ వెతికినీ దొరకలేదు. ఈ విషయాన్ని అక్కడే ఉన్న ఎంఈఓలకు, పాఠశాల ఉపాధ్యాయులకు తెలిపారు. వెంటనే ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న విద్యార్థులకు అంగన్‌వాడీ కార్యకర్త సుజాత బంగారు చెవి దిద్దు పోగొట్టుకున్న విషయాన్ని తెలియజేసి ఎవరికైనా దొరికితే తీసుకువచ్చి అందజేయాలని చెప్పారు. కొద్దిసేపటి తరువాత పాఠశాల ప్రాంగణంలో ఆడుకుంటున్న ఆరవతరగతి విద్యార్థి గంట్యాడ శ్యామ్‌ప్రసాద్‌కు ఆ చెవిదిద్దు కనిపించింది. దానిని వెంటనే తీసి పాఠశాల ఉపాధ్యాయులకు అందజేసి తన పెద్దమనసును చాటుకున్నాడు. శ్యామ్‌కుమార్ అందజేసిన చెవిదిద్దును ఎంఈఓ చంద్రశేఖర్ పాఠశాల హెచ్‌ఎం ఎల్లంనాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, లక్ష్మిల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్త సుజాతకు అందజేశారు. అలాగే నిజాయితీగా తనకు దొరికిన బంగారు చెవిదిద్దును తిరిగి అందజేసిన శ్యామ్‌కుమార్‌ను ఎంఈఓలు చంద్రశేఖర్ పాఠశాల ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది అభినందించారు.


అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న మద్యంబాటిల్స్, అరెస్ట్

మెరకముడిదాం: మండలంలోని గాతాడగ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న మహాలకు స్వాయుడిని పక్కా సమాచారంతో బుదరాయవలస ఎస్సై జె.లోకేష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం పట్టుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నిందితుడి దగ్గర నుంచి 20 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్‌చేసిన నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్సై లోకేష్‌కుమార్ తెలిపారు.

బీమా డ్రామా..!

- వివరాలు సరిగా లేవని కంపెనీ నుంచి రైతులకు మేసేజ్‌లు
- పంటల బీమా ఎగ్గొట్టే ప్రయత్నం
- రబీలో రెండు నెలల క్రితం ప్రీమియం చెల్లించిన రైతులు
- జిల్లాలో 12, 633 హెక్టార్లలో పంటలకు బీమా చెల్లింపు
- ప్రీమియం చెల్లించిన రైతులు 1,23,771 మంది


AX-KISAAN
11:20 AM
నమస్కారం Siripurapu Thatababu గారు,
మీ యొక్క పంటల బీమా (ఫసల్ బీమా) పాలసీ సంఖ్య 040228240011072418 9
నందు భూమికి సంబంధించిన పత్రములు/బ్యాంకుకు సంబంధించిన కాగితములు నందు కొన్ని వ్యత్యాసములు కారణముగా CSC-VLE కు, త్రిప్పిపంపడమైనది. కావున మీరు అతి త్వరగా సరియైన కాగితములను సంబంధిత VLE కు మరియొక సారి అందచేసి మీ పాలసీపై తదుపరి చర్య తీసుకొనుటకు

రైతు తాతబాబుకుకు వచ్చిన మెసేజ్


గంట్యాడ మండలం పెదవేమలిలో సాగులో ఉన్న పెసర పంట

విజయనగరం ఫోర్ట్: "గంట్యాడ మండలం పెదవేమలి గ్రామానికి చెందిన సిరిపురపు తాతబాబు అనే రైతు పెసర పంటకు సంబంధించి 2024 డిసెంబర్ నెలలో బీమా ప్రీమియం చెల్లించాడు. తాజాగా భూమి వివరాలు, బ్యాంకు వివరాలకు వ్యత్యాసం ఉందని ఆ రైతుకు సోమవారం మెసేజ్ వచ్చింది. దీంతో రైతు ఉలిక్కి పడ్డాడు. బీమా ప్రీమియం చెల్లించిన రెండు నెలల తర్వాత పత్రాల్లో వ్యత్యాసం ఉందని మెసేజ్ రావడం ఏమిటని ఆందోళన చెందుతున్నాడు.

అలాగే గంట్యాడ మండలంలోని వసాది గ్రామానికి చెందిన లోకవరపు ఆదినారాయణ కూడా డిసెంబర్ 2024లో పెసర, మినుము పంటలకు బీమా ప్రీమియం చెల్లించాడు. ఆ రైతుకు కూడా రెండు రోజుల క్రితం భూమి వివరాలు, బ్యాంకు వివరాల్లో వ్యత్యాసం ఉందని మెసేజ్ వచ్చింది.'' ఇలా ఈ ఇద్దరు రైతులకే కాదు. వేలాది మంది రైతులకు ఈ విధంగా బీమా కంపెనీ నుంచి మెసేజ్‌లు రావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

ఉచిత పంటల బీమా పథకానికి కూటమి సర్కార్ మంగళం పాడింది. దీంతో రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించారు. అయితే ఇప్పుడు ఆ పంటల బీమాను కూడ ఎగ్గొట్టే ప్రయత్నం బీమా కంపెనీ చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీమా కంపెనీల నుంచి రైతులకు వస్తున్న మెసేజ్‌లే ఈ ఆరోపణలకు ఊతమిచ్చే విధంగా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం పంటల బీమా ప్రీమియం చెల్లిస్తే ఇప్పుడు భూమికి సంబంధించిన పత్రాలు, బ్యాంకుకు సంబంధించిన పత్రాల వ్యత్యాసం కారణంగా బీమా దరఖాస్తును తిప్పి పంపనున్నట్లు మెసేజ్ రావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

రబీలో దెబ్బతిన్న అపరాల పంటలు

2024- 25 రబీసీజన్‌లో సాగు చేసిన అపరాల (పెసర, మినుము) పంటలు అప్పటల్లో కురిసిన వర్షాలకు దెబ్బతిన్నాయి. దీంతో పంటల బీమా ప్రీమియం చెల్లించిన రైతులకు, బీమా కంపెనీ వారు బీమా చెల్లించాల్సి ఉంది. అయితే అధిక మొత్తంలో బీమా చెల్లించాల్సి వస్తుందనే నెపంతో కంపెనీ వారు బీమా చెల్లించే మొత్తం తగ్గించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే మెసేజ్‌లు పంపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. బీమా ప్రీమియం దరఖాస్తులో వ్యత్యాసం ఉందని మెసేజ్‌లు పంపిస్తున్నారు. చాలా మంది రైతులు ఆ మెసేజ్‌లు చూసుకోరు. దీంతో పంటల బీమాకు వారు అర్హులు అయినప్పటికీ బీమా పొందలేరు. డబ్బులు కట్టాం..బీమా వస్తుందనే ధీమాలో రైతులు ఉంటారు. కానీ మెసేజ్‌కు సమాధానం ఇవ్వలేదు. కాబట్టి మీరు బీమాకు అనర్హులని కంపెనీవారు చెప్పే అవకాశం ఉందనే వాదనలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. మెసేజ్‌లు చూసుకోలేని వేలాది మంది రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది.

మెసేజ్‌ల విషయం తెలియదు

పంటల బీమా పథకానికి సంబంధించి బీమా కంపెనీ నుంచి రైతులకు మెసేజ్‌లు వచ్చిన విషయం నా దృష్టికి రాలేదు. విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.
– వి. తారాకరామారావు, జిల్లా వ్యవసాయాధికారి

బీమా ఎగ్గొటే ప్రయత్నమే



రైతులు అపరాలకు బీమా ప్రీమియం చెల్లించి రెండు నెలలు అవుతోంది. ఇప్పుడు భూమి వివరాలకు, బ్యాంకు వివరాలకు వ్యత్యాసం ఉందని మెసేజ్‌లు పెడుతున్నారు. చాలామంది రైతులు మెసేజ్‌లు చూడరు. అటువంటి వారిని అనర్హులుగా గుర్తించి బీమా ఎగ్గొంటేందుకు బీమా కంపెనీ ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోంది. దీనిపై జాయింట్ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశాం.
– బుద్ధరాజు రాంబాబు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు

పంటలకు చెల్లించాల్సిన బీమా ప్రీమియం

పంటల బీమాకు సంబంధించి వరిపంటకు ఎకరాకు రూ.42 వేలు బీమా వర్తిస్తుంది. దీనికి రూ.630 రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మినుము పంటకు ఎకరాకు రూ.20 వేలు బీమా వర్తిస్తుంది. దీనికి ఎకరాకు రైతు రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. పెసర పంటలకు సంబంధించి ఎకరాకు రూ.20 వేలు వర్తిస్తుంది. దీనికి ప్రీమియం రైతు రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. మొక్కజొన్న పంటకు సంబంధించి ఎకరాకి రూ. 540 చెల్లించాలి. దీనికి రూ.36 వేలు బీమా వర్తిస్తుంది. జీడి మామిడికి ఎకరాకు రూ.30 వేలు బీమా వర్తిస్తుంది. దీనికి రైతు ప్రీమియం రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది.

12,633 హెక్టార్లకు బీమా చెల్లింపు

జిల్లాలో రబీసీజన్‌లో అపరాలు, వరి, మొక్కజొన్న పంటలకు రైతులు 12,633 హెక్టార్లకు బీమా ప్రీమియం చెల్లించారు. మినుము 6078 హెక్టార్లు, పెసర 3518 హెక్టార్లు, మొక్కజొన్న 1217 హెక్టార్లు, 1820 హెక్టార్లకు పంటల బీమా ప్రీమియం చెల్లించారు. 1,23,771 మంది రైతులు ప్రీమియం చెల్లించారు.

రూ.1.17 కోట్ల ప్రీమియం చెల్లింపు

వరి, మొక్కొజొన్న, పెసర, మినుము పంటలకు సంబంధించి రూ.1.17 కోట్ల బీమా ప్రీమియం రైతులు చెల్లించారు. మినుము పంటకు రూ.43.58 లక్షలు, పెసరపంట 26.38 లక్షలు, మొక్కజొన్న పంటకు రూ.16. 43 లక్షలు, వరిపంటకు సంబంధించి రూ.28.66 లక్షలు చెల్లించారు.

పుష్పాలంకరణలో పైడితల్లి


పుష్పాలంకరణలో అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. అమ్మవారికి తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ .ప్రసాద్ పర్యవేక్షించారు.

బీమా పరిహారం అందజేత


కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంరూరల్: పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్‌శాఖలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేసి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కె.బుల్లిబాబు కుటుంబానికి పోలీసు శాలరీ ప్యాకేజీ ఇన్సూరెన్స్ స్కీంలో భాగంగా తొలివిడతగా యాక్సిస్ బ్యాంక్ ద్వారా మంజూరైన రూ.38 లక్షల చెక్కును ఎస్పీ మాధవ్ రెడ్డి మంగళవారం జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా సిబ్బంది వేతనాలను పోలీసు శాలరీ ప్యాకేజీ స్కీమ్‌లో భాగంగా బ్యాంకు ఖాతాల్లో జమయ్యే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ స్కీమ్ ప్రకారం ఎవరైనా పోలీసు సిబ్బంది ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు సంబంధిత బ్యాంకులు బీమా మొత్తాన్ని ఇన్సూరెన్స్‌గా అందజేస్తాయన్నారు. ఈ సందర్భంగా పోలీసు శాఖాపరంగా మంజూరు చేసిన విడో ఫండ్ రూ.50వేలు చెక్కును కూడా మృతుడు బుల్లిబాబు కుటుంబసభ్యులకు అందజేశారు. అలాగే అనారోగ్యం కారణంగా మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ పోలిరాజుకు పోలీసుశాఖ పరంగా మంజూరు చేసిన రూ.25వేల చెక్కును కుటుంబసభ్యులకు ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఏఆర్ ఆర్‌ఐలు నాయుడు, రాంబాబు, యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయించిన వారిపై కేసులు



విజయనగరం రైల్వేస్టేషన్‌లో కేసు నమోదు చేస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

విజయనగరం: వినియోగదారులకు తూనిక ప్రకారం అందించాల్సిన నిత్యావసర వస్తువుల తూకంలో తేడా రావడంతో పాటు ప్యాకింగ్ ధరల కన్నా అధిక ధరలకు విక్రయాలు సాగిస్తున్న వ్యాపారస్తులపై తూనికలు కొలతలు శాఖ అధికారులు దాడులు నిర్వహించి పలు కేసులు నమోదు చేశారు. ఆ శాఖకు సంబంధించిన ఇన్‌స్పెక్టర్ ఎం .దామోదరనాయుడు విజయనగరం రైల్వేస్టేషన్, బస్టాండ్ ఇతర చోట్ల పలు రకాల వ్యాపార సంస్థలపై ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి మొత్తం 8 కేసులు నమోదు చేశారు. వాటిలో తూనిక యంత్రానికి సీళ్లు లేకపోవడాన్ని గుర్తించి 3 కేసులు నమోదు చేశారు. రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో సామాన్య ప్రయాణికుడిలా పలు దుకాణాల వద్ద శీతల పానీయాలు, తినుబండారాల ప్యాకెట్లు కొనుగోలు చేసి ముద్రించిన అమ్మకపు ధర కంటే అధికంగా విక్రయించినట్లు గుర్తించి వారిపై 5 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులతో మాట్లాడుతూ వినియోగదారులకు ముద్రించిన ధరకే ప్యాకెట్లు విక్రయించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులకు మోసాల పట్ల పలు సూచనలు చేసి ఎవరైనా తూకంలో గాని, కొలతలో గానీ లేదా ప్యాకెట్లపై ముద్రించిన ధర కంటే అధికంగా విక్రయించినట్లు గుర్తిస్తే తమ శాఖకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

పార్వతీపురంటౌన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లోని రద్దీ ప్రదేశాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. హెల్మెట్ వినియోగంతో ప్రమాదాలను నివారించవచ్చన్నారు. పాఠశాల, కళాశాల స్థాయిలో ఈగల్ క్లబ్బులు ఏర్పాటుకావాలన్నారు. రోడ్డు భద్రతపై తీసుకోవాల్సిన చర్యలపై సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని, కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాను అడ్డుకోవడంలో పోలీస్ యంత్రాంగం చూపిన పనితీరును కలెక్టర్ అభినందించారు. ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గిందని, ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు జిల్లా యంత్రాంగంతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే హెల్మెట్‌ధారణ, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిపై అపరాధ రుసుం విధిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు నిబంధనలపై లారీ, ఆటో, ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో ఏఎస్పీ సురాన అంకిత్ మహావీర్, డీఎస్పీ ఎం.రాంబాబు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు, కేఆర్‌ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డాక్టర్ ఎం.వినోద్‌కుమార్, జిల్లా రవాణా అధికారి ఎం.శశికుమార్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి కె.కవిత, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి బి.చంద్రశేఖర్, ఆర్‌అండ్‌బీ ఈఈ ఎస్.రామచంద్రరావు, ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు ఎం.డి. గయాజుద్దీన్, ఎస్.కృష్ణ, ఏపీఎస్‌ఆర్టీసీ డిపో మేనేజర్లు ఈఎస్‌కే దుర్గ, పి.వెంకటేశ్వరరావు, ఎ.భాస్కర్‌రెడ్డి, ఇతర శాఖాధికారులు కె.చిత్ర, పి.దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

27న అండర్-14 ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్–14 బాల, బాలికల ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపికలు ఈనెల 27న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ శిక్షకుడు డీవీ చారి ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి నగర శివారులో గల విజ్జి స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో 14 సంవత్సరాలలోపు వయస్సు గల బాల, బాలికలు పాల్గొనవచ్చన్నారు. ఆ రోజు జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు విజయనగరం జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 837473707 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20 సంవత్సరాల జైలుశిక్ష

దత్తిరాజేరు: పోక్సో కేసులో పెదమానాపురం గ్రామానికి చెందిన ముద్దాయికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ విజయనగరం పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి మంగళవారం తీర్పు ఇచ్చినట్లు పెదమానాపురం ఎస్సై జయంతి తెలిపారు.ఎస్సై తెలిపిన ప్రకారం కేసు వివరాలిలా ఉన్నాయి. పెదమానాపురం గ్రామానికి చెందిన యువకుడు మారోజు వెంకటేష్ అదే గ్రామానికి చెందిన బాలికకు ట్యూషన్ చెబుతూ ఏర్పడిన పరిచయంతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి వేర్వేరు ప్రాంతాలకు తీసుకువెళ్లి శారీకంగా అనుభవించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడు. ఈ మేరకు 29.6.23న బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టులో ఫైల్ చేయగా విచారణలో నేరారోపణలు రుజువు కావడంతో ముద్దాయికి శిక్షపడినట్లు ఎస్సై తెలిపారు.

డీఏఆర్‌టీపీకు పార్వతీపురం మన్యం ఎంపిక

పార్వతీపురంటౌన్: జిల్లా వ్యవసాయ, గ్రామీణ పరివర్తన ప్రణాళిక (డిస్ట్రిక్ట్ అగ్రిరూల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్లాన్-డీఏఆర్‌టీపీ)కు పార్వతీపురం మన్యం జిల్లా ఎంపికైనట్టు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ప్రాథమిక రంగాల వృద్ధిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ప్రతీ గ్రామీణ కుటుంబం రోగ్యం, శ్రేయస్సు కోసం గ్రామీణఆర్థిక వృద్ధికి మార్గాలను సృష్టిస్తుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ, గ్రామీణ పరివర్తన ప్రణాళిక నివేదికను పదిరోజుల్లో సిద్ధం చేయాలని వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 2,236 ఫారంపాండ్స్‌ను మంజూరు చేశామన్నారు. చెక్ డ్యాములు, ఫిష్ పాండ్స్ నిర్మాణాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. జిల్లాలో నిమ్మగడ్డికి అనుకూల వాతావరణం ఉందని, దానిపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు, పశు సంవర్థక శాఖల అధికారులు కె.రాబర్ట్‌పాల్, బి.బ్యూమల, వి.తిరుపతయ్య, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏపీ గిరిజన గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయాల్లో 2025–26 విద్యాసంవత్సరానికి రాతపరీక్ష ద్వారా 5వ తరగతి, 6 నుంచి 9వ తరగతివరకు ఆంగ్లమాధ్యమంలో మిగిలి ఉన్న సీట్లకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ డీడీ కృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీటీడబ్ల్యూఆర్ఎస్, పి.కోనవలస (బాలురు) 5వ తరగతిలో 80 సీట్లు, 6వ తరగతిలో 3 సీట్లు, 7వ తరగతిలో 5 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఏపీటీడబ్ల్యూఆర్‌యుజేసీ, కురుపాం (బాలికలు) 5వ తరగతిలో 80 సీట్లు, 6వ తరగతిలో 2, 8వ తరగతిలో 2 సీట్లు ఉన్నాయి. ఏపీటీడబ్ల్యూఆర్ఎస్, భద్రగిరి (బాలురు) 5వ తరగతిలో 80 సీట్లు, 6వ తరగతిలో 6 సీట్లు, 7వ తరగతిలో 2, 8వ తరగతిలో 6, 9వ తరగతిలో 8 సీట్లు ఉన్నాయి. ఏపీటీడబ్ల్యూఆర్ఎస్, కొమరాడ (బాలురు) 5వ తరతిలో 80 సీట్లు, 6వ తరగతిలో 4, 7వ తరగతిలో ఒకటి, 9వ తరగతిలో నాలుగు సీట్లు ఉన్నాయన్నారు. హెచ్‌టీటీపీఎస్://టీడబ్ల్యూఆర్ఇఐఎస్‌సెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో మార్చి 25లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కామన్ ఎంట్రన్స్ పరీక్ష ఏప్రిల్ 6న ఏపీటీడబ్ల్యూఆర్ (బాలుర) పి.కోనవలస, ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ (బాలికల) కురుపాం, ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ (బాలుర) భద్రగిరి, ఏపీటీడబ్ల్యూఆర్ఎస్(బాలుర) కొమరాడ కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రకటనలో వివరించారు.

భక్తులకు ఇబ్బందులు కలగరాదు


దేవస్థానం సిబ్బందికి సూచనలు అందిస్తున్న ఆర్డీఓ దాట్ల కీర్తి

నెల్లిమర్ల రూరల్: శివరాత్రి ఉత్సవాలకు రామతీర్థం విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ దాట్ల కీర్తి సూచించారు. రామతీర్థంలో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తరాదని, భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రతి అధికారి సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని క్యూల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని మున్సిపల్, నగర పంచాయతీ అధికారులకు సూచించారు. క్యూలో ఉన్న భక్తులకు మంచినీరు పంపిణీ చేయాలని, చిన్న పిల్లలను గుర్తించి పాలు అందజేయాలన్నారు. తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా చూడాలని కోరారు. అనంతరం దేవస్థానం సిబ్బందితో మాట్లాడి ఉత్సవాల విజయవంతానికి చేపట్టిన ఏర్పాట్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ సుదర్శనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనం అందక.. తల్లికి తోడుగా



ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలిక పేరు జ్యోతి. రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. ఈమె పాఠశాలకు వెళ్లకుండా గాజులు, బొట్లు, తిలకం, చిన్నచిన్న క్లిప్‌లు తదితర మహిళలకు సంబంధించిన వస్తువులు గ్రామంలోని వీధుల్లో కేకలు వేస్తూ అమ్ముతూ కనిపించింది. ఏం తల్లి బడికి వెళ్లడం లేదా?చదువుతున్నావా? లేదా? అని సాక్షి ప్రశ్నించగా తాను స్థానిక ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నానని, తన తల్లి రోజూ ఈ వస్తువులు అమ్మేదని, ఆమెకు జ్వరం రావడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా తాను బడికి సెలవు పెట్టి అమ్ముతున్నానని చెప్పింది. వారు స్థానిక బైపాస్ రూట్ సమీపంలో ఉన్న సత్యసాయిబాబా ఆలయం వెనుక గుడారాల్లో నివాసం ఉంటున్నారు. పాఠశాలకు పిల్లలు వస్తున్నారా? లేదా అన్న విషయం ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మ ఒడి పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15వేలు అందజేసేది. అప్పుడు పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లి చదువుకునే వారు. ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడంతోనే ఇలా పిల్లలు బడికి వెళ్లకుండా చదువుకు దూరమవుతున్నారని ఆ వీధిలోని మహిళలు చర్చించుకోవడం విశేషం.
– రామభద్రపురం